ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



మహబూబాబాద్

శుక్రవారం 12 జూలై 2024

యువకుడి.. ఉన్మాదం

ప్రేమించి పెళ్లి చేసుకున్న యువతి తల్లిదండ్రులపై వేటకత్తితో దాడి



నిందితుడు మేకల నాగరాజు

- భార్యను దూరం చేశారన్న కక్షతో నరికి చంపిన వైనం
- గాఢ నిద్రలో ఉండగా ఘాతుకం
- భార్య, ఆమె సోదరుడిపైనా దాడి.. తీవ్రగాయాలు
- వరంగల్ జిల్లా పదహారు చింతల్‌తండాలో ఘటన



బానోతు శ్రీనివాస్ మృతదేహం

సుగుణ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

సుగుణ, శ్రీనివాస్ దంపతులు (ఫైల్)

చెన్నారావుపేట, జూలై 11: కూతురి ప్రేమ, పెళ్లి వ్యవహారం ఆ దంపతుల దారుణ హత్యకు దారి తీసింది. ప్రేమించి పెళ్లి చేసుకున్న తమను పెద్దల్లో పంచాయితీ పెట్టి విడదీశారని యువతి తల్లిదండ్రులపై కక్ష పెంచుకున్న ఆ యువకుడు.. వారి పాలిట కాలయముడయ్యాడు. గాఢ నిద్రలో ఉన్న వారిపై వేట కత్తితో విచక్షణారహితంగా దాడి చేసి హత మార్చాడు. ఇక ఈ దాడిలో ఆ యువకుడి భార్య, ఆమె సోదరుడు తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నారు. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం పదహారుచింతల్ తండాలో జరిగిన గురువారం తెల్లవారుజామున జరిగిన ఈ దారుణ ఘటన కలకలం రేపింది. పోలీసులు, గ్రామస్థుల తెలిపిన వివరాల ప్రకారం.. పదహారు చింతల్ తండాకు చెందిన బానోతు శ్రీనివాస్ (40) బానోతు సుగుణ (35) దంపతులకు ఓ కుమార్తె, ఓ కుమారుడు ఉన్నారు. గ్రామంలోనే వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్న ఆ దంపతుల కూతురు దీపిక హనుమకొండలోని పింగిళి కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం, కుమారుడు మదన్‌లాల్ అమీనాబాద్ మోడల్ పాఠశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతున్నారు. ఇక గీసుకొండ మండలం కొమ్మాలకు చెందిన మేకల నాగరాజు(బన్నీ) అనే యువకుడు మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం గుండెంగ గ్రామంలోని తన అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటూ ఆటోడ్రైవర్‌గా పని చేస్తూ.. నిత్యం గుండెంగ నుంచి నెక్కొండకు ఆటోను నడుపుతుంటాడు. అయితే గతంలో

మిగతా 7వ పేజీలో..

నర్సంపేటలో ఉద్రిక్తత

- 'చింతల్‌తండా' మృతుల కుటుంబానికి న్యాయం చేయాలంటూ గ్రామస్థుల రాస్తారోకో
- ఆందోళనకారులను కలెక్టర్‌తో మాట్లాడించిన డీసీపీ.. ఆందోళన విరమణ

7



కల్వల శివారు వెంకట్రాంతండా సమీపంలో పత్తి చేలో కలుపు తీస్తున్న మహిళలు

కష్ట కాలం

భారీ వర్షాల జాడలేక రైతన్నల గోస

- మోస్తరు వానలతో సందిగ్ధంలో వానాకాలం సాగు
- జూలైలో 11 రోజుల్లో 13 శాతం లోటు వర్షపాతం
- ముందుకు సాగని వరినాట్లు.. పునాస పంటలు పదిలం

మహబూబాబాద్ అగ్రికల్చర్, జూలై 11 : ఈ ఏడాది భారీ వర్షాలు పడి.. వానాకాలం సాగుకు ఢోకా ఉండదని, సమయానికి వరినాట్లు పడతాయని ఆశించిన రైతులకు కష్టకాలమే కనిపిస్తోంది. జూలై నెలలోనూ ఆశించిన స్థాయిలో వానలు కురవకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఈనెల ఇప్పటికే 11 రోజులు గడిచినా.. అంతంత మాత్రంగానే వానలు పడటంతో జోరుగా సాగాల్సిన వరినాట్లు వెనక్కుపోతున్నాయి. అడపాదడప వర్షాలు మాత్రమే కురుస్తున్నాయే తప్ప భారీ వర్షాల జాడేలేదు. జూన్‌లో సాధారణ వర్షపాతం 141.66 మిల్లీ మీటర్లు ఉండగా, 185.7 మిల్లీమీటర్ల వరకు వర్షం కురిసింది. దాదాపు 44 శాతం వరకు అధికంగా వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా జూలై నెలలో కురిసిన వర్షాలకు ఇప్పటి వరకు మైనస్ 13 శాతంలోటు వర్షపాతంగా ఉంది. దీంతో భారీ వర్షాల కోసం రైతులు ఆశగా ఆకాశం వైపు ఎదురు చూస్తున్నారు.

ముందుకు సాగని వరిసాగు..

జిల్లాలో అడపాదడప కురుస్తున్న వర్షాలకు సాగు విస్తీర్ణం ఇంకా ఊపందు కోలేదు. వరినాట్లు అక్కడక్కడ మాత్రమే పడుతున్నాయి. ఈ ఖరీఫ్‌లో అన్ని పంటలు కలిపి 3,88,153 ఎకరాల విస్తీర్ణం కాగా, ఇప్పటి వరకు 1,23,506 ఎకరాల్లోనే వివిధ పంటలు సాగవుతున్నాయి. వరి మాత్రం 1,83,209 ఎకరాల్లో సాగవుతుందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతుండగా ఇప్పటి వరకు 8,436 ఎకరాల్లో మాత్రమే వరినాట్లు వేశారు. పెద్దవంగరలో 2,525 ఎకరాల్లో, దంతాలపల్లిలో 1,390, తొర్రూరులో 1,278 మండలాల్లో అధికంగా వరినాట్లు వేశారు. బయ్యారంలో 666, కొత్తగూడలో 620, గార్లలో 560, నెల్లికుదురులో 350, మహబూబాబాద్‌లో 345 ఎకరాల్లో వరినాట్లు పడగా మిగతా మండలాల్లో ఇప్పుడిప్పుడే వేస్తున్నారు. గంగారంలో ఇంకా వరినట్లు ప్రారంభం కాలేదు. భారీ వర్షాలుపడి చెరువులు నిండితే తప్ప నాట్లు ఊపందుకునే పరిస్థితి కనబడుట లేదు.

పునాస పంటలు పదిలం..

జిల్లాలో అడపాదడప కురుస్తున్న వర్షాలతో పునాస పంటలకు జీవం పోస్తున్నాయి. జూన్‌లో మొదటి వర్షాలకే పత్తి, ఇతర పంటలు వేశారు. పత్తి, ఇతర పంటలు ఏపుగా పెరుగుతున్నాయి. మహబూబాబాద్ జిల్లాలో 3,88,153 ఎకరాల్లో సాగు లక్ష్యం కాగా, మొక్కజొన్న 38,992 ఎకరాల విస్తీర్ణం కాగా, ఇప్పటి వరకు 30,486 ఎకరాల్లో వేశారు. పత్తి 92,695 ఎకరాలు ఉండగా 78,332 ఎకరాల్లో వేశారు. పెసర్లు 5,162కు గాను 5,411, కందులు 3,778కి గాను 511, వేరుశనగ 205 ఎకరాలకు గాను 38 ఎకరాల్లో, నువ్వులు 25 ఎకరాలకు గాను 10 ఎకరాల్లో, పసుపు 4,439 ఎకరాలకు గాను 267 ఎకరాల్లో వేశారు. వెరసి 1,23,506 ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతున్నాయి. మిర్చినారు ఇప్పుడిప్పుడే పోస్తున్నారు. మిర్చి 56,854 ఎకరాల విస్తీర్ణంలో వేయాల్సి ఉండగా, ఈసారి పత్తి విస్తీర్ణం కొంత మేరకు తగ్గిపోయింది. మిర్చి విస్తీర్ణం పెరగనున్నట్లు తెలుస్తోంది.

జిల్లాలో 1,590 ఐబీ చెరువులు..

జిల్లాలో 1,590 వరకు చెరువులు నీటిపారుదల శాఖ ఆధీనంలో ఉన్నాయి. ఈ రోజు వరకు 543 చెరువులు 25 నుంచి 50శాతం వరకు నీరు చేరింది. 13 చెరువుల్లో 75 శాతం వరకు, 1034 చెరువుల్లో 0 నుంచి 25శాతం వరకు నీరు చేరినట్లు నీటిపారుదల శాఖ అధికారులు చెబుతు న్నారు. జూన్, జూలైలో ఇప్పటి వరకు కురిసిన వర్షాలకు ఆయా చెరువుల్లో ఇప్పుడిప్పుడే నీరు చేరుతోంది. కాగా, జిల్లాలోని ఒక్క బయ్యారం చెరువు మాత్రం ఎగువనున్న ఇతర ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు ఈ చెరువుకు భారీగా వరదనీరు చేరి ఒకట్రెండు రోజుల్లో అలుగుపడే అవకాశాలు కన్పిస్తున్నాయి.

జూలైలో లోటు వర్షపాతమే..

ఈ వర్షాకాలం సీజన్‌లో జూన్ నెలలో సాధారణ వర్షపాతం 141.6 మిల్లీమీటర్లు ఉండగా 185.7 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసింది. అంటే 44 శాతం అధికంగావర్షం కురిసినప్పటికి భారీ వర్షాలు మాత్రం లేవు. రైతులందరూ జూలై నెల మాసం పైనే వర్షాలు పడతాయని ఆశలు పెంచుకుంటు న్నారు. అయితే 11 రోజుల్లో తొమ్మిది రోజులు మాత్రం వర్షం కురిసింది. ఈనెల 10న 360.0 మిల్లీమీటర్ల వర్షపాతం అధికంగా నమోదైంది. సాధారణంగా 1,067.7 మిల్లీమీటర్ల సాధారణ వర్ష పాతం కాగా, 925.2 మిల్లీమీటర్ల వర్షపాతం మా త్రమే కురిసింది. సగటున 66.7 మిల్లీమీటర్లకు గాను 57.8 మిల్లీమీటర్లు మాత్రమే వర్షం కురిసింది. మైనస్ 13 శాతం లోటు వర్షపాతం నమోదు అ యింది. భారీ వర్షాలు పడి చెరు వులు నిండితేతప్ప వరిసాగు ఊపందుకునే పరిస్థితి లేదు. కాలం అవుతుందా..! కాదా? అని రైతులు పరేషాన్‌కు లోనవుతున్నారు.



అమీనాపురంలో పత్తిచేనులో గుంటుక తోలుతున్నరైతు

వర్షాల కోసం ఎదురుచూస్తున్నా

భూక్య భద్రు, రైతు, కల్వల శివారు వెంకట్రాంతండా, కేసముద్రం



వరి సాగు చేసేందుకు వడ్లు అలకడానికి సిద్ధంగా ఉన్నాను. ఆశించిన మేరకు వర్షాలు కురియడం లేదు. వర్షాల ఆలస్యంతో వరినారు కూడా ఆలస్యమే అవుతుంది. వర్షాలు కురియాలని వానదేవుణ్ణి ప్రార్థిస్తున్నా.

ఇతర పంటలవైపు మొగ్గు చూపే అవకాశాలు

అభిమన్యుడు, జిల్లా వ్యవసాయాధికారి



వర్షాలు సకాలంలో కురియకపోవడంతో రైతులు ఇతర పంటలవైపు మొగ్గు చూపే అవకాశం ఉంది. వరిని ఇప్పుడిప్పుడే నాటుతున్నారు. ఈ వానలతో పునాస పంటలు జీవం పోసుకున్నాయి.

హాస్టల్ భవనంపై నుంచి పడి విద్యార్థినికి తీవ్ర గాయాలు

- తండ్రి వదిలి వెళ్లిన కొద్దిసేపటికే కిందపడిన కూతురు
- మహబూబాబాద్ కేసముంద్రంలో ఘటన
- ఖమ్మంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స
- ప్రమాదవశాత్తు అని ప్రాథమికంగా నిర్ధారించిన పోలీసులు



ఖమ్మంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పవిత్ర

కేసముద్రం, జూలై 11 : గిరిజన సంక్షేమశాఖ బాలికల గురుకుల పాఠశాల భవనం మొదటి అంతస్తు నుంచి కిందపడిన ఓ తొమ్మిదో తరగతి విద్యార్థిని తీవ్ర గాయాలపాలైన సంఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల కేంద్రంలో జరిగింది. దీంతో ఆమెను ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్సనందిస్తున్నారు. బుధవారం సాయంత్రం ఈ ఘటన జరగగా, గురువారం వెలుగులోకి వచ్చింది. విద్యార్థిని తండ్రి బోడ ముని తెలిపిన ప్రకారం. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం సూదనపల్లి శివారు బీబీనాయక్ తండాకు చెందిన బోడ ముని, పద్మ దంపతులకు కూతురు పవిత్ర, కుమారుడు ప్రవీణ్ సంతానం. ప్రవీణ్ బయ్యారం ఏకలవ్య గురుకులంలో ఏడో తరగతి చదువుతుండగా, పవిత్ర కేసముద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల గురుకులంలో తొమ్మిదో తరగతి చదువుతోంది. పవిత్ర ఐదో తరగతి నుంచే ఈ హాస్టల్లో ఉంటూ చదువుకుంటోంది. అయితే ఐదు రోజుల క్రితం తలనొప్పిగా ఉందని పవిత్రను ఆమెతండ్రి ఇంటికి తీసుకువెళ్లి మహబూబాబాద్ వైద్యులకు చూపించి కళ్లద్దాలు ఇప్పించి, తిరిగి బుధవారం సాయంత్రం 4 గంటల సమయంలో హాస్టల్‌లో విడిచి వెళ్లాడు. ఆ తర్వాత 5 గంటలకు 'మీ కూతురు భవనంపై నుంచి కింద పడింది' అంటూ హాస్టల్ నుంచి ఫోన్ చేసి మునికి చెప్పారు. ఈ క్రమంలో తీవ్రంగా గాయపడిన పవిత్రను తొలుత ఆటోలో హాస్టల్ నిర్వాహకులే మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

అక్కడి నుంచి తండ్రి ముని ఆమెను ఖమ్మం తరలించారు. ఇదిలా ఉండగా హాస్టల్ మొదటి అంతస్తు పిట్టగోడ వద్ద ఉండగా ఎవరో తోసేసినట్లు అనిపించిందని తన కూతురు తనకు చెప్పినట్లు తండ్రి వివరించారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ స్వప్న మాట్లాడుతూ విద్యార్థిని హాస్టల్‌కు వచ్చిన కొద్దిసేపటికే భవనం పైనుంచి పడిందని, వెంటనే ఆమె తండ్రికి, ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి ఆసుపత్రికి తరలించామన్నారు. ఎస్ఐ వంశీధర్ మాట్లాడుతూ విద్యార్థిని ప్రమాదవశాత్తు భవనంపై నుంచి పడినట్లు ప్రాథమికంగా నిర్ధారణైందని, ఈ ఘటనపై విచారణ జరుపుతున్నామన్నారు.

వనమహోత్సవ లక్ష్యాలను పూర్తి చేయాలి

- సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి
- కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్



సమావేశంలో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్‌సింగ్


మహబూబాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖలకు కేటాయించిన వనమహోత్సవ లక్ష్యాలను వందశాతం పూర్తి చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో గురువారం వనమహోత్సవం, సీజనల్ వ్యాధులు, అమ్మ ఆదర్శపాఠశాలలు, తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనమహోత్సవ లక్ష్యాలను పూర్తి చేసేందుకు యాక్షన్‌ప్లాన్ రూపొందించి, మొక్కలు నాటే ప్రదేశాలను గుర్తించాలన్నారు. నాటిన మొక్కలకు ట్రీగార్డ్ ఏర్పాటు చేసి రక్షణ చర్యలు తీసుకుని వాటిని సంరక్షించాలన్నారు. జిల్లాలో సూచించిన అమ్మఆదర్శ పాఠ శాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు పూర్తి చేయాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందిలేకుండా ఆరోగ్యసేవలందించాలన్నారు. వర్షాకాలంలో గ్రామాలు, పట్టణాల్లో సీజనల్ వ్యాధులు ప్రజలకుండా ఉం డేందుకు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని వసతి గృహాల్లో విద్యార్థులకు ఎలాంటి అనారోగ్య సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో, జిల్లా అధికారులు శాంతకుమారి, డాక్టర్ కళావతిబాయి,నర్మద, హరిప్రసాద్, రామారావు, నర్సింహస్వామి, బాలరాజు, ఎర్రయ్య పాల్గొన్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో బుధవారం రాత్రి కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆస్పత్రిలోని వార్డులను సందర్శిస్తూ రోగులతో మాట్లాడారు. వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అం దించే వైద్యం పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదమున్నం దున జిల్లా ఆస్పత్రితో పాటు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ), ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీ)ల్లో సరిపడా మందులు సిద్ధంగా ఉంచుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లాఆస్పత్రి ఆర్ఎంవో డాక్టర్ జగదీశ్వర్ పాల్గొన్నారు.

గాయపడిన బాలిక మృతి

పాఠశాలకు వెళ్తుండగా ఢీకొట్టిన కారు



చార్లిక (ఫైల్)

మహబూబాబాద్ రూరల్, జూలై 11 : కంబాలపల్లిలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఏడేళ్ల బాలిక చార్లిక గురువారం చికిత్స పొందుతూ వరంగల్ ఎంజీఎంలో మృతి చెందినట్లు రూరల్ ఎస్సై దీపికరెడ్డి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. కంబాలపల్లికి చెందిన సందు సురేష్-సుమతి దంపతుల ఇద్దరు కుమార్తెలు సంతా నం. చిన్న కుమార్తె సందు చార్లిక కంబాల పల్లిలోని ప్రభుత్వ పాఠశా లలో 2వ తరగతి విద్యనభ్యసిస్తోంది. ఉదయం ఇంటి నుంచి స్కూల్‌కు వెళ్లేందుకు రోడ్డుదాటుతున్న క్రమంలో ఖమ్మం నుంచి నర్సంపేట వైపుకు వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి బాలిక చార్లికను ఢీకొట్టి కొంతదూరం ఈడ్చుకువెళ్లింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ బాలికను స్థానికులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యుల సూచనల మేరకు వరంగల్ ఏంజీఎంకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో మృతి చెందింది. రోడ్డు ప్రమాదంలో ఏడేళ్ల బాలిక చార్లిక మృతితో కంబాలపల్లిలో విషాదచాయలు అలుముకున్నాయి. గురువారం కంబాల పల్లిలో పోలీస్‌బం దోబస్తు నడుమ కుటుంబసభ్యులు బాలిక చార్లిక అంత్యక్రియలు నిర్వహించారు. బాలిక చార్లిక తండ్రి సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఖమ్మంకు చెందిన కారు డ్రైవర్ రెడ్డబోయిన రాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మీడియా, పోలీస్‌శాఖ సమన్వయంతో పనిచేయాలి

- జర్నలిస్టులకు పూర్తిగా సహకరిస్తాం
- ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్



మహబూబాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : మీడియా, పోలీస్‌శాఖ సమన్వయంతో పనిచేయాలని, అందుకు జర్నలిస్టులకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌కేకన్ అన్నారు. మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో జర్నలిస్టులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో లాఅండ్‌ఆర్డర్ సమస్యలు, అసాంఘిక కార్యకలాపాలు, గంజాయి, గుట్కా, గుడుంబా, బెల్లం లాంటి అక్రమ రవాణాను అరికట్టేందుకు జర్నలిస్టులు సహాయ సహకారాలు అందించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు, మైనర్ ర్యాష్ డ్రైవింగ్, నెంబర్‌ప్లేట్‌లు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. గంజాయి మత్తులో యువత, భూదందాలు, ఆందోళనకు గురిచేసే రౌడీషీటర్లపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రజలకు, పోలీసులకు మధ్య వారధిగా మీడియా వ్యవస్థ పని చేయాలన్నారు. త్వరలోనే మీడియా, పోలీస్ మధ్య ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. సమావేశంలో డీఎస్పీ తిరుపతిరావు, టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్, జర్నలిస్టులు పాల్గొన్నారు.

వచ్చే ఏడాదిలో రూ.500కోట్లతో నియోజకవర్గ అభివృద్ధి

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 11: వచ్చే ఏడాదిలో రూ.500కోట్ల నిధులతో నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు. డివిజన్ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించానని తెలిపారు. 15ఏళ్లలో నియోజకవర్గం అభివృద్ధి కాలేదన్నారు. 2023లో తాను గెలిచినా నియోజకవర్గం అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీలో చేరానని స్పష్టం చేశారు. ఆ తర్వాత నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రతిపాదనలను సిద్ధం చేసి సీఎంకు అందజేశానన్నారు. వాటిలో 100 పడకల ఆస్పత్రి ఏర్పాటు కోసం నిధులు, స్టాఫ్‌ను మంజూరు చేయాలని, డివిజన్ కేంద్రంలోని ఆర్టీసీ స్థలాన్ని ఆస్పత్రికి ఇవ్వాలని సీఎంకు వినతిపత్రం ఇచ్చామన్నారు. ఘన్‌పూర్ రెవెన్యూ డివిజన్ ఏర్పాటు జరిగినప్పటికీ డివిజనల్ ఆఫీసులు సరిగ్గా పని చేయడం లేదన్నారు. డివిజినల్, సబ్ డివిజినల్ మొత్తం 15 కార్యాలయాలు ఒకే చోట పనిచేసే విధంగా ఇంటిగ్రేటెడ్ రెవెన్యూ డివిజనల్ ఆఫీస్‌ల కాంప్లెక్స్‌ను (సమీకృత రెవెన్యూ డివిజినల్ కార్యాలయాల సముదాయం) నిర్మించడానికి ప్రతిపాదనలు సీఎంకు ఇచ్చానని తెలిపారు. 50వేల స్క్వేర్ ఫీట్‌ల విస్తీర్ణంతో కాంప్లెక్స్‌ను నిర్మాణం చేయాలని, 15 కార్యాలయాలు ఒకే దగ్గర ఉండి ప్రజలకు సేవలు అందించేలా ప్రతిపాదనలు ఇచ్చామన్నారు. ఘన్‌పూర్-నవాబుపేట దేవాదుల మెయిన్ కెనాల్, సబ్ కెనాల్స్ లైనింగ్‌ను ఏర్పాటు చేయాలని కోరడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో 6 ప్రధానమైన ఆర్‌అండ్‌బీ రోడ్లను రూ 120 కోట్లతో ఏర్పాటు చేయాలని మంత్రి కోమటిరెడ్డికి వినతి పత్రం ఇచ్చానని, చిలుపూర్, వేలేరు మండల కేంద్రాలలో మండల కాంప్లెక్స్ నిర్మాణాలకు నిధులు ఇవ్వాలని పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్కకు వినతి పత్రం ఇవ్వడం జరిగిందన్నారు. రూ 500 కోట్ల విలువైన వివిధ పనులు చేయాలని మంత్రులకు వినతిపత్రాలు ఇవ్వడం జరిగిందన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

పక్కాగా రుణమాఫీ, రైతు భరోసా అమలు

ప్రతిపక్షపార్టీలు అనేక మాటలు మాట్లాడినా కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీ, రైతు భరోసాను పక్కాగా అమలు చేస్తుందన్నారు. బీఆర్ఎస్, బీజేపీలు తెలంగాణ అభివృద్ధికి సహకరించడం లేదన్నారు. గత పదేళ్ల కాలంపాటు బీజేపీ అధికారంలో ఉండి తెలంగాణకు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో సీఎం రేవంత్ రెడ్డి జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించబోతున్నారని. యువతను రెచ్చగొడుతున్న బీజేపీ పదేళ్ల కాలంలో ఏ ఒక్కరికైన ఉద్యోగం ఇచ్చారా అని ప్రశ్నించారు. రాముడిపేరు చెప్పుకొని రాజకీయాలు చేసే బీజేపీ నిరుద్యోగులకు చేసిందేంటని ప్రశ్నించారు. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ రాష్ట్రానికి ఏమీ చేశారని ప్రశ్నించారు. ఏరకంగా ప్రభుత్వాన్ని నడిపారు ఏ రకంగా అవినీతిని పెంచి పోషించారు.. కుటుంబానికే పరిమితమైన అధికారం, కుటుంబానికే పరిమితమైన అవినీతి, కుటంబానికే పరిమితమైన అహంకారం వల్లనే కదా బీఆర్ఎస్ ఓడిపోయిందన్నారు. అయినప్పటికీ జ్ఞానోదయం కావడం లేదని ఎద్దేవా చేశారు. రాజకీయ వలసలగూర్చి మాట్లాడే నైతికత కేసీఆర్ కుటుంబానికి లేదన్నారు. రాష్ట్రంలో రాజకీయపార్టీలను విలీనం చేసుకొని రాజకీయ వ్యవస్థకు విలువలు లేకుండా చేసింది, భ్రష్టుపట్టించింది మీరు ఏ ముఖం పెట్టుకొని మాట్లాడుతున్నారు వలసల గూర్చి అని ప్రశ్నించారు. మీరు చేస్తే సంసారం వేరేవాళ్లు చేస్తే వ్యభిచారమా అని ప్రశ్నించారు. ఎందుకు ద్వందనీతి అని మండిపడ్డారు. చట్టం తనపని తాను చేసుకుంటుంది తప్పకుండా కోర్టులు, స్పీకర్లు స్పందిస్తారని తెలిపారు. రాజకీయ వలసల గూర్చి స్పీకర్‌గాని కోర్టులుగాని వారి అభిప్రాయాలను చెబుతాయని హితవుపలికారు. నాశనం పట్టించిన కేసీఆర్ చివరకు ఏ ఒక్క రాజకీయ పార్టీకి ప్రాతినిధ్యం లేకుండా అసెంబ్లీలో అన్ని పార్టీల ఎమ్మెల్యేలను విలీనం చేసుకొని ప్రతిపక్షాల నోళ్లు మూయించిన మీరు ఇప్పుడు పునీతులు అయినట్లుగా తప్పుచేయని వారిగా మాట్లాడడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో నాయకులు బెలిదె వెంకన్న, నరేందర్‌రెడ్డి, నాగరబోయిన శ్రీరాములు, పార్టీ మండలాధ్యక్షుడు శిరీష్‌రెడ్డి, మామిడాల లింగారెడ్డి, భూక్య రమేష్‌నాయక్, నాగరబోయిన యాదగిరి, బూర్ల శంకర్, రాజాక్‌యాదవ్, గుర్రం రాజు, తోట సత్యం, నీల శ్రీధర్, గన్ను నర్సింహులు, నీరటి ప్రభాకర్, చింత ఎల్లయ్య, చిగురు సరిత, జ్యోతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నర్సంపేట పోలీస్‌స్టేషన్ ఎదుట రాస్తారోకో చేస్తున్న పదహారుచింతల్ తండావాసులు

నర్సంపేటలో ఉద్రిక్తత

● 'చింతల్‌తండా' మృతుల కుటుంబానికి న్యాయం చేయాలంటూ గ్రామస్థుల రాస్తారోకో

● ఆందోళనకారులను కలెక్టర్‌తో మాట్లాడించిన డీసీపీ రవీందర్.. ఆందోళన విరమణ



హనుమకొండలో బాధితులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట టౌన్, జూలై 11: చెన్నారావుపేట మండలం పదహారు చింతల్ తండాలో యువకుడి చేతిలో హతమైన బానోతు సుగుణ, శ్రీనివాస్ కుటుంబానికి న్యాయం చేయాలని, నిందితుడికి ఉరిశిక్ష విధించాలని, అతడికి సహకరించిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలంటూ మృతుల కుటుంబ సభ్యులు, తండావాసులు నర్సంపేట పట్టణంలోని పోలీస్‌స్టేషన్, అమరవీరుల స్థూపం సెంటర్లలో గురువారం ఆందోళనలు చేశారు. ఆందోళనకారుల్లో ఓ యువకుడు పెట్రోల్ మీద పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం ఉద్రిక్తతకు దారితీసింది. హత్యకు గురైన దంపతులు బానోతు సుగుణ, శ్రీనివాస్ మృతదేహాలను పోలీసులు పోస్టుమార్టమ్ నిమిత్తం నర్సంపేటకు తీసుకొచ్చారు. పోస్టుమార్టం అనంతరం మధ్యాహ్నం 2గంటలకు పదహారుచింతల్ తండావాసులు, మృతుల బంధువులు, గిరిజన సంఘాలు స్థానిక పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకుని నిందితుడిని ఉరితీయాలని, అతడికి సహకరించిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని నినాదాలు చేస్తూ పోలీస్‌స్టేషన్‌లోకి చొచ్చుకుపోవడానికి ప్రయత్నించారు. స్టేషన్ ఎదుట ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళన చేశారు. టౌన్ సీఐ రమణమూర్తి, పోలీసు సిబ్బంది వారికి ఎంత నచ్చచెప్పినా ఆందోళన విరమించలేదు. ఈ సమయంలో తండాకు చెందిన ఓ యువకుడు తన వెంట తెచ్చుకున్న పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుంటానని హెచ్చరించడంతో అక్కడే ఉన్న పోలీసులు అతడిని అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడినా మంత్రి సీతక్క రావాలని, కలెక్టర్ రావాలంటూ నినాదాలు చేశారు. ఆ తర్వాత అక్కడి నుంచి వరంగల్ క్రాస్‌రోడ్డులోని అమరవీరుల స్థూపం సెంటర్ వద్దకు చేరుకొని సాయంత్రం వరకు ఆందోళన చేపట్టారు. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలగడంతో పోలీసులు ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టారు. అయితే మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు పట్టణంలో రాస్తారోకో ఆందోళనలు ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఉత్కంఠ వాతావరణం నెలకొంది. అమరవీరుల స్థూపం వద్ద జరుగుతన్న ఆందోళన వద్దకు చేరుకున్న డీసీపీ రవీందర్.. వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారదతో సెల్‌ఫోన్ ద్వారా గిరిజన సంఘాల నాయకులతో మాట్లాడించారు. చట్ట ప్రకారం నిందితులను కఠినంగా శిక్షించడం జరుగుతుందని, బాధితులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని కలెక్టర్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

పోస్టుమార్టం గది వద్ద మిన్నంటిన రోదనలు

పోస్టుమార్టం గది వద్ద మృతుల కూతురు, కుమారుడు చేసిన రోదనలు మిన్నంటాయి. తీవ్రగాయాలతో హనుమకొండ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారు.. తల్లిదండ్రులను చివరి చూపునకు వచ్చారు. విగతజీవులుగా పడి ఉన్న తల్లిదండ్రులను చూసి కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ సంఘటనను చూసిన అక్కడికి వచ్చిన వారి కంటతడిపెట్టారు.

రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి : పెద్ది

సుగుణ, శ్రీనివాస్ మృతదేహాలను మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, పెద్ది స్వప్న సందర్శించి, వారి కుమారుడు, కూతురిని పరామర్శించారు. అనంతరం రాస్తారోకోకు వద్దకు చేరుకున్న పెద్ది మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వం మృతుల కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతో పాటు మృతుల కూతురు, కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి సీఎంగా పదవీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని ఆరోపించారు. నర్సంపేట నియోజకవర్గంలో ఈ మధ్యకాలంలో జరుగుతున్న సంఘటనలు ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయని, పోలీసులు, అధికారులు అధికార పార్టీ నాయకుల చెప్పులు మోసే ప్రయత్నం చేస్తున్నారే తప్ప శాంతిభద్రతలను పరిరక్షించడం లేదన్నారు. ఇక తన సొంత మండలానికి చెందిన మృతుల కుటుంబాన్ని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పరామర్శించకపోవడం దురదృష్టకరమన్నారు.

రూ.లక్ష సాయం అందించిన పెద్ది

బాలసముద్రం: చెన్నారావుపేట మండలం పదహారు చింతల్ తండాలో యువకుడి చేతిలో హతమైన బానోతు సుగుణ, శ్రీనివాస్ దంపతుల కూతురు దీపిక, కుమారుడు మదన్ గాయాలతో హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా.. వారిని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పరామర్శించి చికిత్స కోసం రూ.లక్ష ఆర్థిక సహాయం అందించారు. నిందితుడికి వెంటనే కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఉదయం నుంచి గిరిజన సంఘాలు నిందితుడిని శిక్షించాలని నిరసనలు తెలిపినా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించు కోవట్లేదని ఆయన విమర్శించారు. ఈ ఘటనకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని ఆయన తెలిపారు. దీపిక, మదన్‌ను చికిత్స అనంతరం పెద్ది సుదర్శన్‌రెడ్డి తన వాహనంలో చెన్నారావుపేటలోని పదమారు చింతల్ తండాకు తీసుకెళ్లారు.

పోలీసుల అదుపులో నాగరాజు

వరంగల్ క్రైం, జులై 11: వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం చింతల్‌తండాకు చెందిన భార్యాభర్తలైన బానోతు శ్రీను, సుగుణల హత్య కేసులో నిందితుడు నాగరాజును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. భార్య దీప్తి కాపురానికి రావడంలో లేదనే ఆగ్రహంతో ఆమెను చంపేందుకు వచ్చి అడ్డుపడిన శ్రీను, సుగుణ దంపతులను నాగరాజు హత్య చేశాడు. హత్య చేసిన నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. నిందితుడి అరెస్టు విషయాన్ని ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ ధ్రువీకరించారు. దీప్తి తల్లిదండ్రులపై నిందితుడు కత్తితో దాడి చేసి హత్య చేసినట్లుగా విచారణలో వెల్లడైనట్లు డీసీపీ తెలిపారు.



నర్సంపేట పోలీస్‌స్టేషన్ ఎదుట పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడిని అడ్డుకుంటున్న దృశ్యం (సర్కిల్‌లోని వ్యక్తి)



ఆందోళనకారులతో మాట్లాడుతున్న డీసీపీ రవీందర్

యువకుడి ఉన్మాదం



పదహారు చింతల్‌తండాలో హత్య జరిగిన ప్రదేశంలో ఉన్న రక్తపు మడుగు

(5వ పేజీ తరువాయి)

దీపిక అమీనాబాద్ మోడల్ పాఠశాలలో చదువుతున్న సమయంలో నాగరాజు తన ఆటోలో ఎక్కించుకొని పాఠశాల వద్ద దింపేవాడు. ఇలా దీపిక, నాగరాజుల మధ్య పరిచయం ఏర్పడి, అది ప్రేమగా మారింది. అనంతరం డిగ్రీ కోసం హన్మకొండకు వెళ్లిన దీపిక అక్కడే హాస్టల్‌లో ఉంటోంది.

దీపికను పెళ్లి చేసుకున్న నాగరాజు..

హన్మకొండలోని హాస్టల్‌లో ఉంటున్న దీపికను గత నవంబరులో హైదరాబాద్‌లోని ఓ దేవాలంలో రహస్య వివాహం చేసుకున్న నాగరాజు హైదరాబాద్‌లోనే నివాసం ఉంటున్న తన తల్లిదండ్రుల వద్ద ఉంచాడు. వారం రోజుల తర్వాత దీపిక తల్లి సుగుణ.. హాస్టల్ ఉందనుకున్న తన కూతురు కనిపించడం లేదంటూ సుబేదారి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు చేసిన రెండు రోజుల తర్వాత తల్లిదండ్రు లను ఫోన్ చేసిన దీపిక.. తాను నాగరాజు అనే యువకుడిని వివాహం చేసుకున్నానని, ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్నానని చెప్పింది. దీంతో దీపిక తల్లి సుగుణ హైదరాబాద్ లోని తన కూతురు వద్దకు వెళ్లి, నచ్చ జెప్పి ఇంటికి తీసుకొచ్చింది. అప్పటి నుంచి దీపిక తల్లిదండ్రుల వద్దే ఉంటోంది.

భార్యను తన నుంచి విడదీశారని కక్ష కట్టి..

సుగుణ కూతురు దీపికను హైదరాబాద్ నుంచి ఇంటికి తీసుకువచ్చిన తర్వాత.. దీపిక, నాగరాజు ప్రేమ, పెళ్లి విషయంలో ఇటు దీపిక తల్లిదండ్రులు, నాగరాజు పరస్పరం చెన్నారావుపేట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదులు చేశారు. దీంతో ఇరు కుటుంబాలకు పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించి, పెద్దల సమక్షంలో సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఆ తర్వాత పెద్ద మనుషుల మధ్య పంచాయితీ నిర్వహించగా.. దీపిక, నాగరాజు ఎవరికి వారు విడిగా ఉండాలని తీర్మానించగా.. అందుకు ఇరు కుటుంబాల వారు అంగీకరించారు. ఆ తర్వాత హైదరాబాద్ వెళ్లిపోయిన నాగరాజు.. ప్రేమించి పెళ్లి చేసుకున్న దీపికను తన నుంచి దూరం చేశారని దీపిక కుటుంబంపై కక్ష పెంచుకున్నాడు. నెల రోజుల క్రితం హైదరాబాద్ నుంచి మళ్లీ గుండెంగ గ్రామానికి వచ్చి తిరిగి ఆటో నడుపుకుంటున్నాడు. ఈ క్రమంలో పదహారు చింతల్‌తండాలో ఉన్న దీపిక ఇంటి వద్ద ఇటీవల రెక్కీ నిర్వహించాడు. పథకం ప్రకారం గురువారం తెల్లవారుజామున 1.30గంటల సమయంలో నాగరాజు వేట కత్తితో ద్విచక్ర వాహనంపై దీపిక ఇంటికి చేరుకున్నాడు. ఆ సమయంలో ఇంటి వరండాలో దీపిక, ఆమె తల్లిదండ్రులు శ్రీనివాస్, సుగుణ గాఢ నిద్రలో ఉన్నారు. ఇదే అదునుగా భావించిన నాగరాజు తొలుత సుగుణపై, ఆ తర్వాత శ్రీనివాస్‌పై, దీపికపై వేట కత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడు. వారి కేకలు విని ఇంట్లో నిద్రిస్తున్న కుమారుడు మదన్‌లాల్ బయటకు వచ్చాడు. దాంతో అతనిపై కూడా నాగరాజు కత్తితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన సుగుణ అక్కడికక్కడే మృతి చెందింది. దీపిక, మదన్‌లాల్ కేకలు వస్తూ తప్పించుకునే ప్రయత్నం చేశారు. దాంతో చుట్టు పక్కల వారు ఇళ్ల నుంచి బయటకు వచ్చి నాగరాజును అడ్డుకునే ప్రయత్నం చేయగా వారి వైపు కత్తి చూపుతూ అడ్డొస్తే అందరినీ చంపుతా అంటూ బెదిరిస్తూ.. అక్కడి నుంచి పరారయ్యాడు. ఆతర్వాత తీవ్రంగా గాయపడిన శ్రీనివాస్‌ను నర్సంపేట ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అతడూ మృతిచెందాడు. దీపిక, మదన్‌లాల్‌ను హన్మకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. తండావాసుల సమాచారంతో ఎస్ఐ గూడ అరుణ్ కుమార్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

పోలీసుల ఆదుపులో నిందితుడు?

జంట హత్యలకు కారకుడైన మేకల నాగరాజును పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. హత్యలు చేసి పరారైన నాగరాజు గుండెంగలోని ఓ పాఠశాలకు చేరుకుని కత్తితో చేయి కోసుకున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే అక్కడికి వెళ్లి నాగరాజును అదుపులోనికి తీసుకున్నట్లు సమాచారం. నాగరాజుకు సహకరించాడనే అనుమానంతో అతడి స్నేహితుడిపై తండావాసులు దాడిచేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారని, వెంటనే ఆ యువకుడిని చెన్నారావుపేట పోలీసు స్టేషన్‌కు తరలించారని స్థానికులు పేర్కొంటున్నారు.

గ్రామాల్లో పోలీసు బందోబస్తు

జంట హత్యల అనంతరం పదహారు చింతల్‌తండాతో పాటు గుండెంగలో వరంగల్ సీపీ ఆదేశాల మేరకు నర్సంపేట, మహబూబాబాద్‌కు చెందిన పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుండా చర్యలు చేపట్టారు. ఘటనా స్థలాన్ని క్లూస్ టీమ్, డాక్ స్క్వాడ్ బృందాలతో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. డీసీపీ రవిందర్, నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్, గూడూరు సీఐ బాబురావు. నెక్కొండ సర్కిల్ సీఐ చంద్రమోహన్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. గ్రామస్థుల ద్వారా హత్య జరిగిన తెలుకున్నారు. సీఐ రమణమూర్తి, ఖానాపురం ఎస్సై రఘుపతి, నర్సంపేట ఎస్సై ప్రవీణ్, గూడూరు ఎస్సై నగేష్, చెన్నారావుపేట ఎస్సై గూడ అరుణ్‌కుమార్ బందోబస్తును పర్యవేక్షించారు. ఇక దీపిక తల్లిదండ్రుల అంత్యక్రియలు గురువారం రాత్రి ముగిశాయి.

న్యాయం చేయాలని పోలీసులతో వాగ్వాదం

పదహారు చింతల్ తండాలో జంట హత్యకు పాల్పడ్డ నాగరాజును శిక్షించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ తండావాసులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. నిందితుడిని ఉరితీయాలంటూ నినాదాలు చేశారు. నాగరాజును తమకు తక్షణమే అప్పజెప్పాలని పట్టుబట్టారు. ఉదయం 10గంటల వరకు గ్రామస్థులు ఆందోళన కొనసాగించడంతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొనగా బాధిత కుటుంబానికి న్యాయం చేసేలా కృషి చేస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో వారు శాంతించారు.



తండాలో సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

సర్వర్ డౌన్‌తో నిలిచిన రిజిస్ట్రేషన్లు

రాంనగర్, జులై 11: రిజిస్ట్రేషన్ శాఖ సర్వర్ డౌన్ కావడంతో గురువారం రాష్ట్రవ్యాప్తంగా ఆస్తుల రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోయాయి. ఉదయం 11గంటల సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆన్‌లైన్ సేవలు నిలిచిపోయాయి. దీంతో ఆస్తుల రిజిస్ట్రేషన్‌లు జరుగలేదు. హనుమకొండ జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో కేవలం నాలుగు రిజిస్ట్రేషన్‌లు మాత్రమే జరిగాయి. ప్రతీ రోజు జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో వంద వరకు రిజిస్ట్రేషన్‌లు జరుగుతాయి. ఆన్‌లైన్ ఇబ్బందులు తలెత్తడంతో రాష్ట్రవ్యాప్తంగా కోట్ల రూపాయల లావాదేవీలు నిలిచిపోగా, రిజిస్ట్రేషన్ శాఖకు ఈరోజు పెద్దఎత్తున ఆదాయానికి గండిపడింది. దూరప్రాంతాల నుంచి వచ్చిన క్రయవిక్రయదారులు ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆన్‌లైన్ సేవలు ప్రారంభం కాకపోవడంతో తప్పని పరిస్థితిలో వెనుతిరిగారు.

27మంది ఎస్ఐల బదిలీ

వరంగల్ క్రైం, జులై 11: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో భారీగా ఎస్సైల బదిలీలు జరిగాయి. వివిధ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న 27మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
పి.శ్రీనివాస్	వీఆర్	ఐనవోలు పోలీస్ స్టేషన్
టి.ప్రశాంత్‌బాబు	ఐటీ సెల్	నల్లబెల్లి
బి.రామారావు	నల్లబెల్లి	సుబేదారి
ఎన్.వెంకటేశ్వర్లు	వంగర	దుగ్గొండి
జె.పరమేశ్వర్	దుగ్గొండి	వీఆర్
ఎన్.నగేష్	వీఆర్	నర్మెట్ట
కె.శ్రీకాంత్	నర్మెట్ట	సుబేదారి
కె.కుమార్	మట్టెవాడ	గీసుగొండ
ఎ.శ్రీకాంత్	మిల్స్‌కాలనీ	పరకాల
బి.ప్రవీణ్	నర్సంపేట	ఆత్మకూరు
బి.రాంచరణ్	వీఆర్	కేయూసీ
ఎ.సురేష్	కేయూసీ	వీఆర్
ఎస్.రాజన్‌బాబు	మహిళా పీఎస్	వరంగల్ ట్రాఫిక్
డి.సాంబయ్య	సుబేదారి	సీసీఎస్ వరంగల్
ఎం.సురేష్	హసన్‌పర్తి	మిల్స్‌కాలనీ
ఎం.రాజు	హసన్‌పర్తి	సీసీఎస్ వరంగల్
టి.కృష్ణమూర్తి	పీసీఆర్ వరంగల్	సీఎస్‌బీ వరంగల్
ఎస్‌కె.హమీద్	వీఆర్	నర్సంపేట
డి.దేవేందర్	కేయూసీ	హసన్‌పర్తి
బి.రాజేష్‌కుమార్	వీఆర్	జనగామ
ఎం.సిద్దయ్య	వీఆర్	హసన్‌పర్తి
డి.నినిషారెడ్డి	వీఆర్	సీసీఎస్ వరంగల్
బండారి రాజు	ధర్మసాగర్	సీఎస్‌బీ వరంగల్
టి.యాదగిరి	సీసీఎస్	వరంగల్ వరంగల్ ట్రాఫిక్
ఎం.డి.నజీర్	కమిషనరేట్	సీఎస్‌బీ వరంగల్
కె.సారంగపాణి	కమిషనరేట్	సీఎస్‌బీ వరంగల్
జి.రమేశ్	కమిషనరేట్	సీఎస్‌బీ వరంగల్

ఫీడర్లపై భారం లేకుండా ఏర్పాట్లు చేయాలి

టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న వరుణ్‌రెడ్డి

హనుమకొండ టౌన్, జూలై 11 : ఓవర్ లోడ్ భారం పడే ఫీడర్లను గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి సూచించారు. ఎన్పీడీసీఎల్ పరిధిలోని ఉమ్మడి ఐదు జిల్లాల సర్కిళ్ల నోడల్ ఆఫీసర్లతో సీఎండీ గురువారం హనుమకొండ నక్కలగుట్టలోని కార్పొరేట్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్ లేకుండా ఎప్పటికప్పుడు చెక్ చేసుకుంటూ ఆయిల్ లీకేజీ కాకుండా చూసుకోవాలన్నారు. పీక్ లోడ్ సమయంలో కుడా చెక్ చేయాలన్నారు. ప్రతీ పోల్‌కు నంబరింగ్ చేయాలని, ఆ నెంబర్స్ ద్వారా సమస్యలను సులభంగా గుర్తించి సమస్యలను త్వరితగతిన పరిష్కరించవచ్చన్నారు. పవర్ ఫాక్టర్‌లో మెరుగదల ఉండాలన్నారు. బ్రేక్‌డౌన్, ట్రిప్పింగ్స్ కాకుండా సబ్‌స్టేషన్ల నిర్వహణ చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి డైరెక్టర్లు బి.అశోక్ కుమార్, సదర్‌లాల్, తిరుపతిరెడ్డి, మధుసూదన్, సీజీఎంలు కె.తిరుమల్‌రావు, కిషన్, రవీంద్రనాద్, రాజు చౌహాన్, కె.ఎన్.గుట్ట, ఎస్ఈ సివిల్ అంకూస్, కంపెనీ సెక్రెటరీ వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీని మూడు నెలలు వాయిదా వేయాలి

విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కేయూ లైబ్రరీ ఎదుట ఆందోళన

కేయూ క్యాంపస్, జూలై 11: రాష్ట్రంలో డీఎస్సీ పరీక్షలను మూడు నెలల పాటు వాయివా వేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నరసింహరావు డిమాండ్ చేశారు. గురువారం కేయూ లైబ్రరీ ఎదుట పీడీఎస్‌యూ, ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్ నేతృత్వంలో విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని నిరసన ఆందోళనలు చేపట్టారు. ఈ సందర్భంగా నరసింహరావు, మంద నరేశ్‌లు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులు మానసిక సన్నద్ధత, ప్రిపరేషన్, సిలబస్‌లను దృష్టిలో పెట్టుకుని పరీక్షలను వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ వాయిదా కోసం ఉద్యమిస్తున్న ఓయూ విద్యార్థులపై దాడులను ఖండించారు. పోలీసుల భౌతికదాడులను విరమించుకోవాలని అన్నారు. పరీక్షలు వాయిదా వేయకపోతే విద్యార్థి సంఘాల నేతృత్వంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు అభిరామ్ రమేశ్, డీఎస్సీ అభ్యర్థులు శ్రీకాంత్‌రెడ్డి, పృథ్వీ, క్రాంతికిరణ్, శారద, మల్లేశ్, నాగరాజు, రవీందర్, లక్ష్మణ్, అనిల్, ఏబీఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు దార సురేశ్; కేయూఅధ్యక్షుడు దూడపాక నరేందర్, కార్యదర్శి బండారి పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

విదేశాల్లో చదివేందుకు దరఖాస్తుల ఆహ్వానం

వడ్డెపల్లి, జూలై 11: విదేశాల్లో పోస్టు గ్రాడ్యుయేట్స్ చదివేందుకు మైనారిటీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మేన శ్రీను ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం ఓవర్సీస్ పథకం ద్వారా అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, న్యూజిలాండ్, సింగపూర్ దేశాలలో చదువుకునేందుకు అర్హత గల అభ్యర్థులు ఆగస్టు 7వ తేదీ లోపు www.telangana epass.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తు చేసిన అనంతరం దరఖాస్తు ప్రతులను హనుమకొండ కలెక్టరేట్‌లోని మైనారిటీ సంక్షేమ అధికారి కార్యాలయంలో సమ ర్పించాలని పేర్కొన్నారు.

వివాహితతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

వేలేరు(ధర్మసాగర్), జూలై 11: వివాహితపై అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై హరిత గురువారం తెలిపారు. వేలేరు మండలం మల్లికుదుర్ల గ్రామానికి చెందిన వివాహిత తన ఇంటి వద్ద ఒంటరిగా ఉండగా, అదేగ్రామానికి చెందిన పింగిలి సంపత్‌రెడ్డి ఈనెల 9న మధ్యాహ్నం ఇంట్లోకు వెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో ఆమె తప్పించుకొని ఇంట్లో నుంచి తన ఇంటి పక్కనే ఉన్న తన పెద్దమ్మ ఇంట్లోకి వెళ్లింది. అక్కడే ఉన్న స్థానికుడు అనువుల ఎల్లారెడ్డి అతడిని అక్కడి నుంచి వెళ్లగొట్టాడు. దీంతో సంపత్‌రెడ్డితో తన కుటుంబానికి ప్రాణహాని ఉందని గురువారం ఫిర్యాదు చేయడంతో నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.



సీఎంను సన్మానిస్తున్న కుడా చైర్మన్ ఇనుగాల

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన కుడా చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి

వరంగల్ కార్పొరేషన్, జూలై 11: కుడా చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి గురువారం హైదరాబాద్ సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలి ధన్యవాదాలు తెలిపారు. సీఎంను శాలువాతో ఘనంగా సన్మానించి పుష్పగుచ్ఛాలు అందించారు. ఇంకా ప్రభుత్వ ముఖ్యసలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిలతో పాటు మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డిలను కలిసి వెంకట్రామ్‌రెడ్డి పుష్పగుచ్ఛాలు అందించారు. వారు సైతం కుడా చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

పోరాడి సాధించుకున్న భూములు కొనుగోలు చేయద్దు..

జేఎండబ్ల్యూపీ డివిజన్ కమిటీ కార్యదర్శి వెంకటేశ్

వరంగల్ క్రైం, జులై 11: హసన్‌పర్తి మండలం సూధన్‌పల్లి గ్రామ ప్రజలు భూస్వామి పెసలు రాంచంద్రారెడ్డితో పోరాడి సాధించి సాగుచేసుకుంటున్న భూములను ఎవరు కొనుగోలు చేయవద్దని, ఒకవేళ కొనుగోలు చేస్తే వదిలిపెట్టాలని భారత కమ్యూనిస్టు (మావోయిస్టు) జేఎండబ్ల్యూపీ డివిజన్ కమిటీ కార్యదర్శి వెంకటేశ్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. నిర్బంధాలు లెక్కచేయకుండా పోరాడి రాంచంద్రారెడ్డికి చెందిన 20 ఎకరాల భూమిని ఆక్రమించి 35 యేళ్ల నుంచి 42 మంది దళితులు సాగుచేసుకుంటున్నారని ఆయన తెలిపారు. ప్రస్తుతం కాస్తులో, కబ్జాలో వీరే ఉన్నారని, రెవెన్యూ రికార్డుల్లోనూ వీరే ఉన్నారని ఆయన వివరించారు. ఆ భూముల ధరలు పెరగడంతో గ్రామానికి చెందిన తిక్క దేవేందర్ మావోయిస్టు పార్టీ పేరు చెప్పి రాంచంద్రారెడ్డి వారసులతో ఒప్పందం చేసుకుని దళితుల భూములను అమ్ముతున్నాడని అన్నారు. అమ్మడానికి ఒప్పుకోని వారిని బెదిరింపులకు గురిచేస్తూ కేసులు పెట్టిస్తున్నాడని ఆయన ఆరోపించారు. ఆ భూములు దక్కే వరకు పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. భూస్వాములకు వ్యతిరేకంగా ప్రజలు పోరాడి ఆక్రమించుకున్న భూములను ఎవరూ కొనుగోలు చేసినా ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని వెంకటేశ్ హెచ్చరించారు.

నేడు ఫార్మసీ విభాగంలో విస్తృత ఉపన్యాసం

కేయూ క్యాంపస్, జూలై 11: కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల సెమినార్‌హాల్‌లో శుక్రవారం ఉదయం 11గంటలకు క్లినికల్ ఫార్మసీ ప్రాక్టీసు- ఏ టూల్ ఫర్ బెటర్ పేషెంట్ కేర్ అనే అంశంపై విస్తృత ఉపన్యాసం ఏర్పాటు చేసినట్లు కేయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నీరడి. ప్రసాద్ గురువారం తెలిపారు. కేయూ ఫార్మసీ కళాశాల పూర్వవిద్యార్థి డాక్టర్ రమేశ్ అడెపు హాజరై కీలక ఉపన్యాసం చేస్తారని పేర్కొన్నారు. పరిశోధకులు, విద్యార్థులు హాజరుకావాలని కోరారు.

రేపటి నుంచి కేయూ దూరవిద్య కాంట్రాక్టు తరగతులు

కేయూ క్యాంపస్, జూలై 11: కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం ఎం.ఎస్సీ బాటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్ సబ్జెక్టుల మొదటి ఏడాది మొదటి సెమిస్టర్ కాంట్రాక్టు తరగతులు జూలై 13నుంచి ప్రారంభమవుతాయని దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం గురువారం తెలిపారు. కేయూ క్యాంపస్‌లోని జువాలజీ సెమినార్ హాల్‌లో తరగతులు జరుగుతాయని అడ్మిషన్లు పొందిన వారందరూ విధిగా హాజరుకావాలని కోరారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా

● పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



తాగునీటి పనులకు శంకుస్థాపన చేస్తున్న యశస్వినిరెడ్డి

తొర్రూరు, జూలై 11 : నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తామని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. గురువారం తొర్రూరులో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి, ఆమె మాట్లాడారు. నూతనంగా ఏర్పడిన మునిసిపాలిటీల్లో 24 గంటల పాటు తాగునీరు అం దించేందుకు కేంద్ర ప్రభుత్వ సాకారంతో ఏర్పాటు చేయనున్న అమృత్ నీటి సరఫరా పనులకు శంకుస్థాపన చేశా రు. రూ.28 కోట్లతో చేపట్టే ఈ పనుల ద్వారా పట్టణంలో ప్రజలకు నిరంతరం తాగునీరు అందుతుందని తెలిపారు. 4 ఓవర్ హెడ్ ట్యాంక్‌లతో పాటు పట్టణంలోని అన్ని వార్డుల్లో వాటర్ పైప్‌లైన్ నిర్మాణం చేపడతారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి, మునిసిపల్ చైర్మన్ రాంచంద్రయ్య, వైస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, కాకిరాల హరిప్రసాద్, పెదగాని సోమయ్య, సంతోష్, సోమ రాజశేఖర్, మేకల కుమార్, భూసాని రాము, గజానంద్, శ్రావణ్, అనిల్, శంకర్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్నికల అఫిడవిట్‌లో తప్పుడు లెక్కలు చూపించిన పాలకుర్తి ఎమ్మెల్యే

బీజేపీ ఉమ్మడి వరంగల్ జిల్లా నేత దామోదర్‌రెడ్డి

మహబూబాబాద్ రూరల్, జూలై 11 : ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి తన అఫిడవిట్‌లో తప్పుడు లెక్కలు చూపించారని బీజేపీ ఉమ్మడి వరంగల్ జిల్లా శిక్షణ తరగతుల కన్వీనర్ పాకనాటి దామోదర్‌రెడ్డి ఆరోపించారు. మహబూబాబాద్ బీజేపీ పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తొర్రూరు మండలం గుర్తూరులో 70 ఎకరాల వ్యవసాయ భూమిని ఎకరం రూ.2.17 లక్షల చొప్పున కొనుగోలు చేసినట్లు అఫిడవిట్‌లో ఎమ్మెల్యే, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి చూపించారని చెప్పారు. ఒక్కో ఎకరం విలువ ప్రస్తుతం రూ.20 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో రూ.110 కోట్లు ఖర్చు చేశారని, అవి ఎక్కడ నుంచి తీసుకువచ్చారని ప్రశ్నించారు. ఈ విషయంపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్, తొర్రూరు ఆర్డీవో నర్సింహారావు, తహసీల్దార్ వినోద్‌కుమార్‌కు ఈ భూమి విషయంపై గతంలో ఫిర్యాదు చేశామని చెప్పారు. వారి అక్రమ సంపాదన గూర్చి తాను చర్చించడానికి ఎక్కడికైనా వచ్చేందుకు సిద్ధంగా ఉన్నానని, ఎమ్మెల్యేతో పాటు ఝాన్సీరెడ్డి వచ్చేందుకు సిద్ధమా అని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు యలమంచిలి వెంకటేశ్వర్‌రావు, పట్టణాధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్, పల్లె సందీప్, ఓర్సు పద్మావతి, వెన్నమల్ల సందీప్, నరేష్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పాకనాటి దామోదర్‌రెడ్డి

న్యాయవాదులపై పోలీసుల దాడులు సరికాదు

తొర్రూరు, జూలై 11 : న్యాయవాదులపై పోలీసుల దాడులు సరికాదని బుధవారం సిద్దిపేటలో అడ్వకేట్ రవి కుమార్‌పై చట్ట విరుద్ధంగా పోలీసుల దాడిని నిరసిస్తూ గురువారం తొర్రూరు కోర్టు ఎదుట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రవీణ్ రాజు మాట్లాడుతూ న్యాయవాదుల రక్షణకు ప్రత్యేక చట్టాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ సెక్రెటరి జి.రామకృష్ణ, సైదులు,నాగరాజు, బి.వెంకన్న, వి.మహేష్, యాకాంబ్రం, మధుసూదన్, రఘురామ్ రెడ్డి, ఐలోని, శ్రీను, వెంకటేశ్వర్లు, నాగేశ్వర్ పాల్గొన్నారు.

జర్నలిస్టులపై పోలీస్ చర్యలను నిరసిస్తూ ఆందోళన



మానుకోటలో నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళన చేస్తున్న జర్నలిస్టులు

మహబూబాబాద్ టౌన్, జూలై 11 : హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో కవరేజ్‌కు వెళ్లిన జర్నలిస్టుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును నిరసిస్తూ మానుకోట పట్టణంలో జర్నలిస్టుల సంఘాల ఆధ్వర్యంలో గురువారం ఆందోళన చేపట్టారు. జర్నలిస్టులు నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళన నిర్వహించారు. ఈ సంద ర్భంగా జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు పర్కాల రవీందర్‌రెడ్డి, చిత్తనూరి శ్రీనివాస్ మాట్లాడారు. ఉద్యమాల ఖిల్లా, విద్యకు నిలయం ఉస్మానియా యూనివర్సిటీలో వార్త సేకరణకు వెళ్లిన జర్నలిస్టుల పట్ల పోలీసులు ప్రవర్తించిన తీరు సరికాదన్నారు. ఇలాంటి ఘనటలు పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టులు గాడిపెల్లి శ్రీహరి, చుక్కల మధు, ఉప్పల రంగా, తౌటిశెట్టి రాహుల్, అశోక్, యాకూబ్, మురళీ, విక్రమ్, కుమార్, ప్రవీణ్ పాల్గొన్నారు.

వూరె గురునాథరావుకు రాయలసీమ యూనివర్సిటీ డాక్టరేట్



మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 11 : జిల్లా కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు వూరె గురునాథరావుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రాయలసీమ యూనివర్సిటీ గురువారం డాక్టరేట్ ప్రకటించింది. ఆయన సమర్పించిన విద్యార్థి కేంద్రీకృత విధానంలో బోధన అభ్యాసం-ఇన్ సర్వీస్ భౌతిక రసాయణశాస్త్ర ఉపాధ్యాయుల అవగాహనలు, అనుభవాలు అనే పరిశోధనకు డాక్టరేట్ ప్రకటించారు. హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ విద్యావిభాగ విశ్రాంత ఆచార్యుడు డాక్టర్ బలరాములు నేతృత్వంలో ఈ పరిశోధన పూర్తి చేశారు. గురునాథరావు ప్రస్తుతం కేసముద్రం మండలం పెనుగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భౌతిక రసాయనశాస్త్ర ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహిస్తున్నారు. గతంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నుండి విజ్ఞానశాస్త్ర విద్యలో డాక్టరేట్ అందుకున్నారు. ఉపాధ్యాయుగా విధులు నిర్వహిస్తూనే నిత్య విద్యార్థిగా పరిశోధనలు చేస్తూ జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో ఇప్పటికీ సుమారు 90కి పైగా పరిశోధన పత్రాలను వివిధ పరిశోధనా పత్రాలను సమర్పించారు. గురునాథరావుకు డాక్టరేట్ రావడం పట్ల పలువురు విద్యావేత్తలు, విద్యాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీయాలి

అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పొ

మహబూబాబాద్ టౌన్, జూలై 11 : పభుత్వం ఇంటింటా ఇన్నోవేటర్‌ద్వారా నూతన ఆవిష్కరణలకు స్వాగతం పలికిందని.. తద్వారా విద్యార్థులు, యువత, అన్నివర్గాల్లో దాగి ఉన్న నైపుణ్యతను వెలికితీయాలని అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పొ సూచించారు. స్థానిక సమస్యలను పరిష్కరిం చేందుకు వినూత్న ఆవిష్కరణలు రూపొందించాలన్నారు. మహబూబాబాద్ నుంచి ఇంటింటా ఇన్నోవేటర్‌పై గురువారం సంబంధిత అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సమస్యలను పరిష్కరించేందుకు మీ దగ్గర ఆవిష్కరణలుంటే ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం, జిల్లా పరిపాలనకు మీ ఆవిష్కరణ ప్రదర్శించే అవకాశం పొందాలన్నారు. ఈ క్రింది వివరాలను వాట్సాప్ ద్వారా పంపించాలని సూచించారు. పేరు, వయసు, ఫొటో, వృత్తి, గ్రామం, మండలం, జిల్లా, ఆవిష్కరణ పేరు, ఆవిష్కరణను వివరిస్తూ 100 పదాలతో రాసి పంపాలని లెనిన్‌వత్సల్ టొప్పొ. ఆవిష్కరణ ఫొటోలు (04), ఆవిష్కరణ వీడియో (2నిమిషాలు) సెల్ నెంబరు: 91006 78543కు పంపించాలని చెప్పారు. 3 ఆగస్టు 2024లోపు దరఖాస్తు చేయాలని మరిన్ని వివరాలకు వెబ్‌సైట్ team tsic.telangana.gov.in/@teamtsic, tsic @telangana.gov.in లో సంప్రదించాలన్నారు. జిల్లాలోని ప్రజలు, యువతీ, యువకులు మీ ఆలోచనకు, సృజనాత్మకతకు పదును పెట్టాలన్నారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు, జడ్పీసీఈవో నర్మద, డీపీవో హరిప్రసాద్ పాల్గొన్నారు.

టెన్త్‌లో వందశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి

● జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 11 : పదో తరగతి వార్షిక ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు అన్నారు. పర్వతగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం సందర్శించి మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని సూచించారు. హెచ్ఎంలు శ్రీరాములు, లింగమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● కురవి : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచి బలోపేతం చేయాలని డీఈవో రామారావు అన్నారు. కురవిలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలను గురువారం ఆకస్మీకంగా ప్రార్థన సమయంలో సందర్శించారు. ఎంఎన్‌వో వెంకటేశ్వర్‌రావు, హెచ్ఎం వహీద్, డీఎస్‌వో అప్పారావు, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కె.ఉప్పలయ్య, డి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● జిల్లాలోని ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో వర్క్ అడ్జెస్ట్‌మెంట్ కింద ఉపాధ్యాయులను నియమించాలని డీఈవోకు పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు సంకా బద్రినారాయణ వినతిపత్రం అందించారు.

సురేష్ కుటుంబసభ్యులకు పరామర్శ

● అన్నివిధాలుగా ఆదుకుంటాం

● మాజీ మంత్రి దయాకర్ రావు

తొర్రూరు, జూలై 11 : సామాజిక మాధ్యమంలో ఎమ్మెల్యే పీఏను ప్రశ్నించిన మాలోత్ సురేష్‌ను పోలీసులు అకారణంగా కొట్టారనే నేపథ్యంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు గురువారం సాయంత్రం వెలికట్టె గ్రామ శివారు ఈదులకుంట తండాలో సురేష్ కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సామాన్యులపై దాడులు పెరిగాయని, వారి కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా పైఅధికారులకు ఫిర్యాదు చేస్తానని, బాధితులు ఎలాంటి ఆందోళన చెందవద్దన్నారు. సురేష్‌ను కొట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకునేలా చేస్తానని హామీ ఇచ్చారు.

నేడు కొత్తగూడలో ప్రజాదర్బార్

● పాల్గొననున్న మంత్రిసీతక్క

కొత్తగూడ, జూలై 11 : కొత్తగూడలోని రైతువేదికలో శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్టు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య పేర్కొన్నారు. గురువారం కొత్తగూడల మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ప్రజాదర్బార్‌లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క పాల్గొంటారని పేర్కొన్నారు. ఇందులో కలెక్టర్, ఐటీడీఏ పీవో, అన్ని శాఖల ఉన్నతాధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రజలు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు.

బయ్యారంలో తప్పిపోయిన వృద్ధుడు



బయ్యారం, జూలై 11 : బయ్యారం మండలకేంద్రానికి చెందిన ఇర్రి లింగయ్య (76) నాలుగు రోజుల క్రితం వరంగల్‌లో ఉంటున్న తన కూతు రు వద్దకని బయలు దేరి కనిపించకుండా పోయినట్లు ఎస్ఐ ఉపేందర్ గురువారం తెలిపారు. లింగయ్య తన కూతురి వద్దకు చేరుకోకపోవడంతో ఆయన కుమారుడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గుడుంబా తయారు చేస్తే పీడీయాక్టు నమోదు చేస్తాం : డీఎస్పీ

కురవి, జూలై 11 : గుడుంబాను తయారు చేసి ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే చర్యలకు పాల్పడితే పీడీయాక్టులు నమోదు చేస్తామని మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు హెచ్చరించారు. కురవి మండలం జగ్న్యా తండాలో గురువారం గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించి ఇద్దరు ఇండ్లలో పెద్ద ఎత్తున గుడుంబా పానకాన్ని ధ్వంసం చేశారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ... గుడుంబాకు యువత బానిస కావడం ద్వార ఎన్నో కుటుంబాలు నష్టపోతున్నాయని చెప్పారు. గుడుంబా తయారీదారులపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ఈ దాడుల్లో రూరల్ సీఐ సర్వయ్య, కురవి ఎస్సై గోపి, ఎస్సై అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకులు బురదజల్లడం సరికాదు

మహబూబాబాద్ టౌన్, జూలై 11 : కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను అధోగతి పాలు చేసిన బీఆర్ఎస్ నాయకులు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బురదజల్లడం సరైన విధానం కాదని జాతీయ బీసీ సంక్షేమ సంఘం, కాంగ్రెస్ పార్టీ నాయకులు శంతన్ రామరాజు అన్నారు. మహబూబాబాద్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో నిరుద్యోగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు కమ్మగాని కృష్ణమూర్తి, గంగాధరి బాలరాజు, గుంజె హన్మంతు పాల్గొన్నారు.

విద్యార్థుల క్షేత్రపర్యటన

కేసముద్రం, జూలై 11 : మండలంలోని అన్నారం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు క్షేత్రపర్యటనలో భాగంగా గురువారం కేసముద్రంలో వివిధ ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించారు. స్థానిక పోలీస్‌స్టేషన్, మార్కెట్ యార్డు, పోస్టాఫీసు, బ్యాంకులు, ఎస్ఆర్ఎస్‌పీ డీబీఎం-48 ప్రధాన కాల్వను సందర్శించి ఆయా కార్యాలయాల పనితీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎంమడుపు రవీందర్, పట్నాల సత్యనారాయణ, బత్తుల శ్రీధర్, శ్రీనివాసశర్మ, సోని, ఉల్లి స్వప్న పాల్గొన్నారు.

రూ.200 నకిలీ కరెన్సీ కలకలం?



మానుకోటలో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న రూ.200 ఫేక్‌నోట్

మహబూబాబాద్ టౌన్, జూలై 11 : జిల్లా కేం ద్రంలో రూ.200 నకిలీ కరెన్సీ నోట్లు కలకలంరేపుతున్నాయి. గత రెండ్రోజుల కిందట మానుకోట పట్టణంలోని ఓ రెస్టారెంట్‌లో బిర్యానీ పార్సిల్ తీసుకుని ఒకరు, మరో కిరా ణం షాపులో సరుకులు కొనుగోలు చేసుకుని ఇంకొకరు నకిలీ రూ.200 కరెన్సీతో బిల్లుకట్టి వెళ్లిపోయినట్లు ప్రచారం జరుగుతోంది. నెంబర్ లేని బైక్‌పై వచ్చిన యువకులే ఈ రూ.200 నకిలీ కరెన్సీ నోట్లను చెలమణి చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేద్దామంటే కేసు.. ఇతర త్రా ఇబ్బందులు తమ తలకే చుట్టుకుంటాయేమోనని పోతే... రూ.200 పోయినవని.. వ్యాపారులు ఎవరికి చెప్పుకోలేక లోలోన మదన పడుతున్నట్లు తెలుస్తోంది. ఏదేమైనా గురువారం నకిలీ రూ.200 కరెన్సీ అంటూ సోషల్ మీ డియాలో కూడా ఒకనోటు వైరల్‌గా మారడం పట్టణంలో చర్చనీయాంశమైంది.

బయ్యారంలో డెంగీ కలకలం?

బయ్యారం, జూలై 11 : మండల కేంద్రంలో ఓ యువకుడికి డెంగీ పాజిటీవ్ వచ్చినట్లు తెలియడంతో కలకలం రేపుతోంది. రాష్ట్రంలో కొద్దిరోజులుగా డెంగీ జ్వరంతో ప్రజలు ఆందోళన చెందుతుండడం తెలిసిందే. ఈ క్రమంలో స్థానికంగా ఓ యువకుడికి నాలుగు రోజుల క్రితం జ్వరం రాగా, తాజాగా రక్త పరీక్షలు నిర్వహించగా డెంగీ పాజిటీవ్ అని తేలినట్లు తెలిసింది. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే గ్రామపంచాయతీల్లో పారిశుధ్యంలో లోపించడంతో దోమలు విపరీతంగా వ్యాప్తి చెంది ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. ఈ క్రమంలోనే డెంగ్యూ కలకలం రేపుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నివారణ చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

భార్య ఆత్మహత్యకు కారకుడైన భర్తకు పదేళ్ల జైలు

డోర్నకల్, జూలై 11 : భార్య ఆత్మహత్యకు కారకుడైన భర్తకు పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ మహబూబాబాద్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖరప్రసాద్ గురువారం తీర్పు వెల్లడించినట్లు డోర్నకల్ సీఐ బందం ఉపేందర్‌రావు తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం. డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలోని సుభాష్ వీధికి చెందిన గొల్లపల్లి ప్రవీన్‌కుమార్ తన భార్య గొల్లపల్లి ఆగ్నెస్‌గోయింసా మెజక్సీవ్‌ను తరుచు వేధింపుకుల గురి చేస్తుండేవాడు. దీంతో మనస్తాపంకు గురైన ఆమె 2019లో ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుందని చెప్పారు. ఈ ఘటనపై మృతురాలు తల్లి పుచ్చకాయల బేబిరాణి డోర్నకల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు అప్పటి మహబూబాబాద్ డీఎస్పీ నరేష్‌కుమార్ నిందితుడు గొల్లపల్లి ప్రవీన్‌కుమార్‌పై కేసు నమోదు చేశారు. మహబూబాబాద్ జిల్లాకోర్టులో గురువారం ఈ కేసు తీర్పుకు రావడంతోపీపీ చిలకమారి వెంకటేశ్వర్లు కేసును వాదించారు. ఎస్సై పవన్‌కుమార్ సాక్షులను ప్రవేశపెట్టారు. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి ప్రాసిక్యూషన్ వాదనలు ఏకీభవిస్తూ నిందితుడైన గొల్లపల్లి ప్రవీన్‌కుమార్‌కు పది సంవత్సరాల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పును వెల్లడించారు.

22 సంవత్సరాలకే సీఏలో పట్టా



కాలసిద్ధి

డోర్నకల్, జూలై 11 : మునిసిపల్ కేంద్రానికి చెందిన కాల సిద్ధిజైన్ అతి పిన్నవయస్సులోనే దేశంలోనే అత్యంత కఠినమైనదిగా పేర్కొనే చార్టర్డ్ అకౌంటెంట్ (సీఏ) పరీక్షలో 50శాతం మార్కులతో ఉత్తీర్ణ సాధించారు. సిద్ధి సాధించిన విజయంతో ఆమె కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు అభినందించారు. కాలసిద్ధి టెన్త్ స్థానిక నిర్మల హైస్కూల్లో విద్యనభ్యసించారు. ఇంటర్ వరంగల్‌లోని ఓ ప్రైవేట్ కళాశాల విద్యనభ్యసించి సీఏ పరీక్షలకు సన్నద్ధమయ్యారు.

పోడు భూముల సమస్యను పరిష్కరించాలి



డీఎఫ్‌వోకు పోడుభూముల సమస్యను వివరిస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

బయ్యారం, జూలై 11 : మండలంలో పోడుభూముల సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని ఇల్లెందు ఎమ్మెల్యే కోరెం కనకయ్య జిల్లా అటవీశాఖాధికారి విశాల్ బత్తుల విజ్ఞప్తి చేశారు. కాచనపల్లి, కంబాలపల్లి, సాంబతండా, పందిపంపులలో పోడు భూముల సమస్య నెలకొనడంతో వాటి పరిష్కారానికి గురువారం ఆయన పోడు రైతులతో కలిసి జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, డీఎఫ్‌వోలను కలిశారు. పట్టాలు ప్రభుత్వం మంజూరు చేసినవి కావడంతో సర్వే నిర్వహించి రైతులకు న్యాయం జరిగే విధంగా చర్యలు చేపడుతామని కలెక్టర్, డీఎఫ్‌వో ఎమ్మెల్యేకు తెలిపారు. బయ్యారం సొసైటీ చైర్మన్ మధుకర్‌రెడ్డి, ఎంపీటీసీ సోమేష్, పోడు రైతులు పాల్గొన్నారు.

'నర్సరీల చట్టాన్ని పాటించాలి'

మహబూబాబాద్ అగ్రికల్చర్, జూలై 11 : నర్సరీదారులు నర్సరీల చట్టం నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి మరియన్న తెలిపారు. మహబూబాబాద్‌లోని రైతు వేదికలో గురువారం నర్సరీదారులకు నర్సరీల చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని నర్సరీదారులు ఉద్యానవన శాఖద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని నియమనిబంధనలు, నర్సరీ చట్టం ప్రకారం, నారును పెంచుకోవాలని తెలిపారు. లైసెన్స్‌లు లేకుండా నర్సరీల్లో మిరపవిత్తనాలు, కూరగాయల నారు అమ్మవద్దని, కొనవద్దని సూచించారు. నిబంధనలు పాటించని వారిపై నకిలీ విత్తనాలు నారు పోసిన వారిపై పీడీయాక్టులు జైలుకు పంపిస్తామని, జరిమానా విధిస్తామని హెచ్చరించారు. జిల్లా వ్యవసాయాధికారి అభిమన్యుడు, మల్యాల ఉద్యానశాస్త్రవేత్త ఈ.రాంబాబు, నర్సరీదారులు పాల్గొన్నారు.

56 కేజీల గంజాయి పట్టివేత

● కారు.. సెల్‌ఫోన్‌లు స్వాధీనం.. ఇద్దరిపై కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్, జూలై 11 : మానుకోట జిల్లా కేంద్రం శివారు అనంతారం స్టేజీ సమీపంలో కల్యాణ్ నర్సరీ వద్ద 56 కేజీల గంజాయిని పట్టుకున్నట్లు రూరల్ సీఐ సర్వయ్య తెలిపారు. మహబూబాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో గంజాయి తరలిస్తున్న ఇద్దరు నిందితులను ప్రవేశపెట్టి కేసు వివరాలను వెల్లడించారు. మహారాష్ట్రలోని బీడ్ జిల్లా అస్తీ తాలుకా, మాత్‌కొండి గ్రామానికి చెందిన అజిత అరుణ్ తౌసర్ కారు డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అదే ప్రాంతానికి చెందిన పి.అనందరావు కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వీరిని మహారాష్ట్ర పిరిడికి చెందిన మారుతిజార్ తమకు రూ.50 వేలు ఇచ్చి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సీలేరు నుంచి నిషేధిత గంజాయిని తీసుకురావాలని చెప్పి పంపించినట్లు సీఐ పేర్కొన్నారు. సీలేరు నుంచి మహబూబాబాద్‌కు వస్తున్న కారును అనంతారం స్టేజీ వద్ద తనిఖీ చేపట్టగా అందులో 56 కిలోల గంజాయిని గుర్తించారు. సదరు గంజాయితో పాటు తరలింపుకు ఉపయోగించిన కారు, రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకుని అందుకు బాధ్యులైన ఇరువురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. 56 కిలోల గంజాయి విలువ సుమారు రూ.11.20 లక్షలు ఉంటుందని చెప్పారు.

మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు నేతృత్వంలో చాకచక్యంగా వ్యవహరించి గంజాయిని పట్టుకున్న రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సై దీపికరెడ్డి, సిబ్బందిని జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌కేకన్ అభినందించారు. ఈ విలేకరుల సమావేశంలో కానిస్టేబుళ్లు వెంకన్న, బాలరాజు, లింగారావు, రవి, కుమారస్వామి, శ్రీహరి, ఉమ, అశోక్ పాల్గొన్నారు.

'గుడుంబా రహిత జిల్లాయే లక్ష్యం'

గూడూరు, జూలై 11 : గుడుంబా రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతీ ఒక్కరు సహకరించాలని సీఐ బాబురావు అన్నారు. గోవిందాపురంలో గురువారం గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. 20 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని, 300 లీటర్ల బెల్లంపానకాన్ని ధ్వంసం చేసినట్లు చెప్పారు. దాడుల్లో మూడు చందు, మూడు సూక్య, దరావత్ స్వరూప, దరావత్‌నర్సింహాలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై నగేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

● కేసముద్రం : కాట్రపల్లిలో పోలీసులు గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 25 లీటర్ల గుడుంబా, 200 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు ఎస్ఐ వంశీధర్ తెలిపారు. ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

● బయ్యారం : మిర్యాలపెంట, చింతలతండాల్లో పోలీసులు గుడుంబా స్థావరాలపై దాడులు చేశారు. ఈదాడుల్లో 30 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని 1500 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు సీఐ రవికుమార్ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ ఉపేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

● డోర్నకల్ : జోగ్యతండా గ్రామపంచాయతీ పరిధిలోని తండాల్లో సీఐ ఉపేందర్‌రావు ఆధ్వర్యంలో పోలీసులు గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ ఎత్తున బెల్లంపానకాన్ని ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో ఎస్సై సంతోష్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

● నర్సింహులపేట : కౌసల్యదేవిపల్లి శివారు రూప్లాతండలో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించి ఇద్దరు మహిళలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జి.సతీష్ తెలిపారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు రూప్లా తండలో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించి 200లీటర్ల బెల్లంపానకం ధ్వంసం చేసి, 10లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది ఉన్నారు.

15 ఇసుక ట్రాక్టర్లపై కేసు నమోదు

నర్సింహులపేట, జూలై 11 : ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న 15 ట్రాక్టర్లను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై గండ్రాతి సతీష్ బుధవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కౌసల్యాదేవిపల్లి శివారు ఆకేరు వాగు నుంచి బుధవారం అర్ధరాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారనే పక్కా సమాచారంతో దాడులు నిర్వహించి పదిహేను ట్రాక్టర్లు అదుపులోకి తీసుకొని పరిశీలించగా ఎలాంటి అనుమతి లేకపోవడంతో ఇసుకలోడుతో ఉన్న ట్రాక్టర్లను రాణాలో సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

'దాడులు చేయడం సరికాదు'

తొర్రూరు, జూలై 11 : అకారణంగా లంబాడ యువకుడు మాలోత్ సురేష్‌పై దాడి చేయడం సరికాదని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ భీమానాయక్ అన్నారు. గురువారం వెలికట్టె శివారు ఈదులకుంట తండాలో గత రాత్రి పోలీసుల చేతిలో అకారణంగా దెబ్బలు తిన్న మాలోత్ సురేష్‌ను పరామర్శించి మాట్లాడారు.ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు రాందాస్, మంగీలాల్, శ్రీను, ప్రవీణ్, అరుణ్ నాయక్, శివశర్మ, రాములు, రాజేందర్, సరోజ, ద్వాలి, రవి పాల్గొన్నారు.

'ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి'

తొర్రూరు, జూలై 11 : ఉపాధ్యాయ రంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్. మల్లారెడ్డి అన్నారు. గురువారం తొర్రూరు డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సంఘం సభ్యత్వ నమోదు చేపట్టారు. ఉపాధ్యాయ సంఘం నాయకులు భిక్షపతి, యాకూబ్, నాగమల్లయ్య, రఫీ, శంకర్, రాములు, మల్లయ్య, యాకేందర్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణాత్మకమైన పాలనపై దృష్టి పెట్టాలి

మరిపెడ, జూలై 11 : కాంగ్రెస్ ప్రభుత్వం పార్టీ ఫిరాయింపులపై కాకుండా ప్రజలకు నిర్మాణాత్మకమైన పాలన అందించేలా దృష్టి సారించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయ్‌సారధి అన్నారు. గురువారం మరిపెడ మండల ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం మల్లెపాక యాకన్న అధ్యక్షతన జరుగగా ఆయన పాల్గొని మాట్లాడారు. పార్టీ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ, పోగుల శ్రీనివాస్, అబ్దుల్ రషీద్, పోలెపాక వెంకన్న, నారాయణ, అంజి, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

తొర్రూరు, జూలై11 : కాంగ్రెస్‌ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ గురువారం బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్ వినోద్ కుమార్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అర్బన్ అధ్యక్షుడు పల్లె కుమార్ మాట్లాడారు. నాయకులు రంగు రాములు, సురేష్, రాజేష్, యాకయ్య, శేఖర్, నవీన్, సంతోష్, సందీప్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలల అభివృద్ధికి కృషి చేస్తా

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 11 : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అభివృద్ధికి కృషి చేస్తానని కాకతీయ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు మూడు బాలుచౌహాన్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని నూకల రాంచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలను గురువారం సందర్శించి వసతులను పరిశీలించి, మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

'పరిమిత సంతానంతో ఎంతో మేలు'

మహబూబాబాద్ టౌన్, జూలై 11 : అధిక జనాభా వల్ల అనేక అనర్థాలు కలుగుతాయని, పరిమిత సంతానం ఎంతో మేలని జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పొ అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహబూబాబాద్‌లో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక జిల్లా ఆస్పత్రి నుంచి తహసీల్ ఆఫీస్ వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1987 జూలై 11 వతేదీ నాటికి ప్రపంచ జనాభా 500 కోట్లకు చేరుకుందని, దానికి గుర్తుగా 1989 సంవత్సరం నుంచి జూలై 11న ఏటా ప్రపంచ జనాభా దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు చెప్పారు. జిల్లా జనరల్ ఆస్పత్రి డాక్టర్ శ్రీనివాసరావు, వైద్యాధికారులు బి.వెంకట్రాములు, వెంకన్న, జగదీశ్వర్, వైదేహి, అంబరీష, బిందుశ్రీ, శ్రవణ్, విజయ్‌కుమార్, ప్రసాద్, రవీందర్‌రావు, కృష్ణార్జునరావు, మంగమ్మ, మహేందర్‌రెడ్డి, రాజుగీత, శ్రీనివాస్, రామకృష్ణ పాల్గొన్నారు.